# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

ఆదివారం | 1 సెప్టెంబర్ 2024 | పేజీలు 8


## నీ కంటే చిన్నవాడు సీఎం పదవి గుంజుకుంటే చేతకాని దద్దమ్మవు

### ఉత్తమ్ కుమార్ రెడ్డిపై జగదీశ్ రెడ్డి తీవ్రవ్యాఖ్యలు

- రేవంత్ రెడ్డిని అనాల్సిన మాటలను తమ పార్టీకి ముడిపెడుతున్నాడని విమర్శ
- ఉత్తమ్ కుమార్ రెడ్డి నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరిక
- రేవంత్ రెడ్డిని అనడం చేతకాక కేసీఆర్ మీద పడి ఏడుస్తున్నారని మండిపాటు



-3 లో

# అనుమతులిచ్చారు... అడ్డంగా బుక్కయ్యారు



కేసులకు సిఫార్సులు చేసిన హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఐపీఎస్..

అక్రమార్కుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తించిన "హైడ్రా" ఇప్పుడు అవినీతి అధికారుల గుండెల్లోనూ గుబులు పుట్టిస్తుంది.. ఒకప్పుడు పత్రికల్లో వచ్చినా పట్టించుకోలేదు, బేఖాతర్ చేశారు..! ఫిర్యాదులను లెక్క పెట్టలేదు నిర్లక్ష్యం వహించారు..! మేమే అధికారులం, మేము ఏం చెపితే అదే వినాలి అన్న తీరుగా వ్యవహరించారు.. ఆ మిడిసి పాటే వారికి ఎదురు తిరిగింది.. ధనార్జనే ధ్యేయంగా విధులు నిర్వర్తించి కోట్లకు పడగలెత్తిన, చిన్నస్థాయి నుండి పెద్దస్థాయి అధికారులు ఉన్నారు.. దశాబ్ద కాలంగా రాజ్యం ఏలారు.. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో ప్రజల ఆస్తులకు భరోసాగా..!అవినీతిని అంతమొందించే దిశగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు, తెలంగాణ ప్రభుత్వం నిర్ణయంతో "హైడ్రా"ను రూపొందించారు.. బహూశా హైడ్రా వచ్చాక, అధికారులపై 6 క్రిమినల్ కేసులు మొదటి సారిగా నమోదు చేశారు కాబోలు.. "ఈవోడబ్ల్యు" ఆర్థిక నేరాల విభాగం ఆధ్వర్యంలో ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి తెలిపారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 31:**



రామకృష్ణ కమిషనర్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్.. కేసు నమోదైన అధికారి..



పూల్ సింగ్ బాచుపల్లి తహశీల్దార్.. కేసునమోదైన అధికారి..



రాజ్‌కుమార్ సిటీ ప్లానర్ హెచ్ఎండిఏ.. కేసు నమోదైన అధికారి..



శ్రీనివాసులు.. మేడ్చల్ జిల్లా ఏడి సర్వేయర్..

- దొరికిపోయిన హెచ్ఎండిఏ, మున్సిపల్, ల్యాండ్ రికార్డ్స్ ఏడి, రెవెన్యూ, అధికారులు..
- చెరువుల్లో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ఈ అధికారుల బృందం..
- హైడ్రా సిఫార్సులతో.. సైబరాబాద్ సిపి అవినాష్ ఆరుగురిపై క్రిమినల్ కేసులు నమోదు..
- దర్యాప్తు ప్రారంభించిన ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యు) పోలీసులు..
- హైడ్రా ఏర్పడి 44 రోజుల్లో.. 50 మంది అవినీతి అధికారులను గుర్తింపు..

-2లో



అధికారులపై కేసులు నమోదు చేసిన సీపీ అవినాష్ మహంతి ఐపీఎస్..

## మల్లంపేట్ కత్వ చెరువు ఖతం.. నీళ్ళు రాకుండా పూడ్చేశారు..

### ఎనభై నాలుగు కుటుంబాల మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు..



- 100 ఎకరాల కత్వ చెరువుపై రెవెన్యూ, ఇరిగేషన్ నిర్లక్ష్యం..
- దుండిగల్, కాజీపల్లి అటవీప్రాంతం మీదుగా వచ్చే సర్‌ప్లస్ నాలా పూడ్చేసిన కబ్జాదారులు..
- పునరుద్దరించాలని "హైడ్రా" కమిషనర్‌కి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఏ.ఆంజనేయులు విజ్ఞప్తి..

-3 లో

## తెలంగాణలో దంచికొడుతున్న వానలు..

### స్తంభించిన జనజీవనం



-5 లో

# అనుమతులిచ్చారు.. అడ్డంగా బుక్కయ్యారు..



ఎర్రకుంట చెరువులో అర్ధరాత్రి కూల్చివేతల ఫోటో.. ఆగష్టు 15..



బాచుపల్లి ఎర్రకుంట చెరువులో హైడ్రా కూల్చివేతల నాటి ఫోటో..







**హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో బృందాలను ప్రభుత్వం మరింత పటిష్ఠం చేస్తోంది.. నోటీసులతో పాటు కూల్చివేతల వ్యవహారం అంతా హైడ్రా కమిషనర్ సూచనలతోనే..! హైడ్రా పోలీసు స్టేషన్‌ల ఏర్పాటుకు సిద్ద మవుతుంది.. ఇకమీదట హైడ్రా పేరుతోనే నోటీసులు జారీ చేస్తారు.. చెరువుల్లో నిర్మాణాలను ప్రోత్సహించిన అధికారులపై హైడ్రా దృష్టి సారిస్తోంది.. బాచుపల్లి ఎర్రగుంట చెరువులో ఆక్రమ బహుళ అంతస్థు నిర్మాణాలను మ్యాప్స్ నిర్మాణ సంస్థ యాజమాన్యం సుధాకర్ రెడ్డిపై కూడా కేసులు నమోదైనట్టు తెలుస్తోంది.. మరికొన్ని చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు గాను మరికొందరు బిల్డర్‌లపై కేసులు నమోదు చేసినట్టు తెలుస్తుంది..**

- **మొదటి పేజీ తరువాయి**

హైదరాబాదు డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) ఏర్పాటును యావత్ తెలంగాణ ప్రజలు ఘనంగా స్వాగతిస్తున్నారు.. హైడ్రా చేపడుతున్న చర్యలకు మద్దతుగా భారీ ర్యాలీలు చూశాం.. ఇప్పుడు ఒక స్టెప్ ముందుకు వేస్తూ..! చెరువుల్లో నిర్మాణాలకు రెవెన్యూ"ఎన్ఓసి" మున్సిపల్, హెచ్ఎండిఏ అనుమతులు ఇచ్చిన, అవినీతి అధికారులపై 'హైడ్రా' కేసుల నమోదుకు సిఫార్సులు చేశారు.. దీంతో 6 మంది అధికారులపై 'హైడ్రా' క్రిమినల్ కేసులు నమోదు చేయడం ప్ర ప్రథమం.. హైడ్రా దృష్టి చెరువుల ఆక్రమణ దారుల నుండి..! అనుమతులు ఇచ్చి ప్రోత్సహించిన వారిపైకి మళ్ళిందని అధికారులపై కేసుల నమోదుతో తేటతెల్లం చేస్తుంది.. చెరువుల కబ్జాలపై ఫిర్యాదుల పరిశీలన, అక్రమంగా ఇచ్చిన అనుమతులపై హైడ్రా పరిశోధన కావచ్చు.."హైడ్రా" ఏర్పడి 44 రోజులహా వ్యవధిలో చర్యలు చేపట్టిన చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు జారీచేసిన అధికారుల జాబితాను సుమారు 50 మందికి పైగా లిస్ట్ తయారు చేశారు.. కేసుల నమోదుకు అంతం కాదిది ఆరంభం.. సైబరాబాద్ ఈవోడబ్ల్యూ వింగ్ అధికారులు, ఆరుగురు అధికారులపై కేసులు నమోదు చేశారు. హౌజీహెచ్ఎంసీ, రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్, హెచ్ఎండీఏకు చెందిన ఇద్దరు, మున్సిపల్ కార్పొరేషన్, అధికారులు ఉన్నారు.

## కేసులు నమోదైన అధికారులు..

శాఖల సమన్వయం లేమితో చర్యలకు దూరంగా ఉండే అధికారులు.. అవినీతిలో మాత్రం పాలుపంచుకున్నట్లు కేసుల నమోదుతో స్పష్టమవుతుంది.. బాచుపల్లి మండలం ప్రగతి నగర్ గ్రామ పరిధిలోని ఎర్రకుంట చెరువుకు బాచుపల్లి తహశీల్దార్ పూల్‌సింగ్ తప్పుడు ఎన్ఓసి జారీచేశారు. దీంతో హెచ్ఎండిఏ అనుమతులకు లైన్ క్లియర్ చేశారు.. దీంతో హెచ్ఎండిఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, హెచ్ఎండిఏ సిటీ ప్లానర్ రాజ్‌కుమార్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు..
లోకల్‌బాడీ నిజాంపేట్ మున్సిపల్ అధికారుల చేతివాటం.. మేడ్చల్ జిల్లా ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు తప్పుడు సర్వే తోడైంది..గతంలో కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా రాజ్‌కుమార్ విధులు నిర్వర్తించారు.. నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ రామకృష్ణ, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుధామ్స్‌పై కేసులు నమోదు అయ్యాయి.. హైడ్రా సిఫార్సుల మేరకు ఈ ఆరుగురు అధికారులపై ఈవోడబ్ల్యు పోలీసులు దర్యాప్తు మొదలైంది.. సీపీ అవినాష్ మహంతి కేసులు నమోదు చేశారు..

# మల్లంపేట్ కత్వ చెరువు ఖతం.. నీళ్ళు రాకుండా పూడ్చేశారు..

## ఎనభై నాలుగు కుటుంబాల మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు..


పూడ్చేసిన కట్టుకాలువపై నిర్మాణాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ సారా, మత్స్యకారులు..


కట్టుకాలువను పరిశీలిస్తున్న అధికారి, మత్స్యకారులు..

- 100 ఎకరాల కత్వ చెరువుపై రెవెన్యూ, ఇరిగేషన్ నిర్లక్ష్యం..
- దుండిగల్, కాజీపల్లి అటవీప్రాంతం మీదుగా వచ్చే సర్ప్లస్ నాలా పూడ్చేసిన కబ్జాదారులు..
- పునరుద్ధరించాలని "హైడ్రా" కమిషనర్‌కి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఏ.ఆంజనేయులు విజ్ఞప్తి..

**దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 31:**దుండిగల్ గండి మైసమ్మ మండలంలోని చెరువులు, కట్టుకాలువలు కబ్జాకు గురికాకుండా కాపాడాలని బీజేపీ నేత ఎంబరి ఆంజనేయులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.. మండలంలోని మల్లంపేట్ కత్వ చెరువుకు నీళ్ళు రాకుండా పూడ్చేశారని ఇరిగేషన్ ఏఈ సారాకు ఫిర్యాదు చేశారు.. సుమారు 84 మత్స్యకారుల కుటుంబాలు కత్వ చెరువుపై ఆధారపడి ఉన్నాయని అన్నారు.. అధికారుల నిర్లక్ష్యంతో చెరువుకు వచ్చే కట్టుకాలువలు పూడ్చేస్తున్నారని మత్స్యకారులు ఆరోపించారు.. సర్ప్లస్ నాలా పునరుద్ధరించకపోతే మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎంబరి ఆంజనేయులు వివరించారు.. మీడియా ద్వారా మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కి, హైడ్రా కమిషనర్‌కి, దుండిగల్ ఎమ్మార్వోకి, ఇరిగేషన్ డిఈకి ఆయన విజ్ఞప్తి చేశారు.. మల్లంపేట గ్రామంలో కత్వ చెరువు దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉందని అన్నారు.. చెరువులో చేపలు పెరగాలంటే..! కనీస నీటిమట్టం ఉండాలని, కత్వ చెరువుకు దుండిగల్ ప్రాంతం ఫారెస్ట్, కాజీపల్లి నుండి వచ్చే వర్షపు నీరు చెరువులోకి రాకుండా ఎక్కడికక్కడ పూడ్చేసి కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.. కత్వ చెరువు కబ్జాకు రియల్ ఎస్టేట్ మాఫియా కూడా అడ్డంకిగా తయారైందని ఆరోపించారు.. నాలాలో నీళ్ళు ప్రహించకుండా, కిలోమీటర్ పొడవున నాలను పూడ్చేశారని ఇరిగేషన్ ఏఈ సారతో కలిసి మత్స్యకారులు ఆ ప్రాంతాన్ని బీజేపీ నేత ఆంజనేయులు పర్యటించారు.. చెరువులోకి నీళ్లు రాకుండా ఉన్నట్లు ఏఈ సారా శనివారం స్వయంగా పరిశీలించారు.. కట్టుకాలువ ద్వారా వచ్చే వర్షపు నీరు ఫారెస్ట్ మీదుగా చెరువులోకి చేరినట్లయితే.. చేపలపై ఆధారపడే 84 కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని అధికారులను కోరారు..




చెరువుకు నీళ్ళు రాకుండా, పూడ్చి వేయడంతో నిలిచిపోయిన వర్షపు నీరు..

# నీ కంటే చిన్నవాడు సీఎం పదవి గుంజుకుంటే చేతకాని దద్దమ్మవు

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనాల్సిన మాటలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తమ పార్టీకి ముడిపెడుతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌పై నిన్న మంత్రి చేసిన విమర్శల మీద జగదీశ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి నోటిని అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. పట్టపగలు నోట్ల కట్టలతో దొరికిన దొంగలు మీరేనని వ్యాఖ్యానించారు.రేవంత్ రెడ్డిని అనడం చేతకాని మంత్రి కేసీఆర్‌పై పడి ఏడుస్తున్నారని ధ్వజమెత్తారు. డబ్బులతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన వారు మీవాళ్లయితే, కేసీఆర్ పదేళ్ల ప్రజాసంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తి అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన భాషను మార్చుకుంటే మంచిదని హితవు పలికారు. నీకంటే వెనుక వచ్చినవాడు, నీకంటే చిన్నవాడు ముఖ్యమంత్రి పదవి గుంజుకుంటే చేతకాని దద్దమ్మగా ఉత్తమ్ ఉన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే రేవంత్‌కు పడ్డ చివాట్లు మీకూ తప్పవని ఉత్తమ్‌ను హెచ్చరించారు. ఆయన ఇలాగే తిడుతుంటే చీవాట్లు పడతాయని, కానీ ఆయన ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేరన్నారు. రాష్ట్రంలో డెకాయిట్ల పాలన సాగుతోందని విమర్శించారు. తెలంగాణలో ఎక్కడకు వెళ్లినా అధికార పార్టీ వారి కమీషన్లు, దోపిడీ గురించే ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. తమ హయాంలో రైతులకు ఇబ్బందులు లేకుండా నీటిని, విద్యుత్‌ను అందించామన్నారు. కానీ ఇప్పుడు నీటి కోసం, విద్యుత్ కోసం ధర్నాలు జరుగుతున్నాయన్నారు. సాగునీటి కోసం ధర్నాలు కొనసాగితే యాసంగి నాటికి కాంగ్రెస్ నాయకులు ప్రజల్లో తిరగలేరని హెచ్చరించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉత్తమ్ విఫలమయ్యారని వ్యాఖ్యానించారు. బాధ్యతలు చేతకాకుంటే మంత్రి పదవిపై ఆయన పునరాలోచన చేయాలన్నారు. కాళేశ్వరం నుంచి నీటిని అందించకుంటే కాంగ్రెస్ వారికి రైతులతో దెబ్బలు తప్పవన్నారు. రైతుల సమస్యలపై కేసీఆర్ త్వరలో కార్యాచరణను ప్రకటిస్తారని తెలిపారు.

# పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి వరం





**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ ఆగస్టు 31** పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థిక చేయూతను అందజేస్తాయని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం నాగారం పురపాలక సంఘ పరిధిలోని స్టార్ ఫంక్షన్ హాల్ నందు కళ్యాణ లక్ష్మి చెక్కుల, షాదీ ముబారక్ చెక్కుల పంపణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కళ్యాణ లక్ష్మి చెక్కులు -74, షాది ముబారక్ చెక్కులు 6 పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తాయని, పెళ్లి పందిరిలోనే చెక్కులు అందజేస్తే బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జి. రాజేంద్ర కుమార్, కీసర తహశీల్దారు అశోక్ కుమార్, కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు ఇతర నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో వర్ష బీభత్సం... నీటిలో చిక్కుకున్న కారు..

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ తో పాటు తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. శనివారం ( ఆగస్టు 31, 2024 ) తెల్లవారుజాము నుండి నాన్ స్టాప్ గా కురుస్తున్న వర్షానికి చాలా చోట్ల రోడ్లన్నీ జలమయం అవ్వటంతో ఆఫీసులకు వెళ్లేవారు, స్కూళ్లకు వెళ్లే చిన్నారులు ట్రాఫిక్ జామ్ తో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉండగా.. మక్తల్ నియోజకవర్గం ఉట్కూరు మండలంలోని మల్లేపల్లి గ్రామంలో భారీ వర్షాల కారణంగా రహదారి జలమయం అయ్యింది. ఈ క్రమంలో ఓ కారు వర్షపు నీటిలో చిక్కుకుంది.
అటుగా వెళ్తున్న స్థానికులు చిక్కుకున్న కారును చూసి బయటకు తీశారు.బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం బలపడటంతో ఇరు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో మూడురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించింది వాతావరణశాఖ.

# విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను అలోవర్చుకోవాలి







- డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్
- పాఠశాలలో మాక్ యూత్ పార్లమెంట్

**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ ఆగస్టు 31** విద్యార్థులు విద్యార్థి దశ నుండి క్రమశిక్షణతో కూడిన నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి భవిష్యత్తులో అన్ని రంగాలలో ఉన్నత స్థాయిలో ఉండాలని బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ అన్నారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు మెరుగుపరచాలని, ప్రజాస్వామ్యం పట్ల అవగాహన కలిగించాలనే ఉద్దేశ్యంతో పల్లవి మోడల్ స్కూల్లో 2024 రెండు రోజులు విద్యార్థుల చేత మాక్ యూత్ పార్లమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపల్ తనూజ హాజరయ్యారు. ఈ కార్యక్రమం పార్లమెంటరీ విధానాలను అనుకరించి, విద్యార్థులు ప్రజాస్వామ్య ప్రక్రియలో మునిగిపోయేలా చేసింది. విద్యార్థుల చర్చలలో "విక్షిత్ భారత్ 2047 బిల్లు" కూడా ఉంది, ఇది 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా రూపాంతరం చెందుతుందని, దాని ఆర్థిక, విద్యఆరోగ్య సంరక్షణ లక్ష్యాలపై చర్చలు, బహిరంగ ఉరి వంటి, వివాదాస్పద అంశాలతో సహా. మరొక క్లిష్టమైన బిల్లు, "తప్పనిసరి నేషనల్ సర్వీస్ చట్టం, 2024" పౌరులకు నిర్బంధ సేవను ప్రతిపాదించింది, దాని సాధ్యత వ్యక్తిగత స్వేచ్ఛపై ప్రభావంపై చర్చలకు దారితీసింది. మాక్ సెషన్‌లు నిజమైన పార్లమెంటరీ డైనమిక్స్‌కు అద్దం పట్టాయి. ఫైనాన్స్, టాక్సేషన్ జాతీయ విద్యా విధానంపై చర్చలు జరిగాయి. ఎలక్టోరల్ బాండ్‌లు అవినీతి వంటి సమకాలీన సమస్యలను ప్రస్తావిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ప్రతిపక్ష నాయకుల వంటి కీలక వ్యక్తులను విద్యార్థులు పోషించారు. జాతీయ సమస్యలపై ప్రస్తుత విమర్శలు, ప్రతిస్పందనలను ప్రతిబింబిస్తూ మీడియా అనుకరణ, ప్రజల అభిప్రాయ దృక్పథాలు ఏకీకృతం చేయబడ్డాయి. చురుకైన పౌరసత్వం ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ మాక్ యూత్ పార్లమెంట్ శాసన ప్రక్రియలు బహిరంగ ఉపన్యాసాల గురించి విద్యార్థుల గ్రహణశక్తిని మెరుగుపరిచింది అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏఎస్ రావు నగర్‌లో 'సఖి' ది హౌస్ ఆఫ్ కంచి వీవ్స్ స్టోర్ ప్రారంభం





**మేడ్చల్ జిల్లా పెన్ పవర్ ఆగస్టు 31:**హైదరాబాద్ ఎ.ఎస్.రావు నగర్ నడిబొడ్డున ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త స్టోర్..., "సఖి" ది హౌస్ ఆఫ్ కంచి వీవ్స్ ప్రారంభమైంది. ఏ ఎస్ రావు నగర్‌లోని అధునాతన ఫ్యాషన్ ఔత్సాహికులకు సాంప్రదాయ వస్త్రాల వైభవాన్ని చేరువ చేస్తుంది. ఈ ప్రారంభోత్సవానికి ప్రముఖ అతిథులు శ్రీ శ్రీ శ్రీ వాసుదేవానంద గిరి స్వామి, రామారావు, బి వెంకట భార్గవ మూర్తి, నడుపల్లి నాగశ్రీ, మేఘన రామి, ఐడ్రీమ్ అంజలి, దీపికా రంగారావుతో పాటు యాంకర్ లాస్య మంజునాథ్ హాజరయ్యారు. సఖి....ది హౌస్ ఆఫ్ కంచి వీవ్స్ భారతీయ వస్త్రాలు, ఫ్యాషన్ యొక్క మహోన్నత వారసత్వాన్ని ప్రదర్శించడానికి నూతన ప్రమాణాలను ఏర్పాటు చేసింది. ఈ స్టోర్ సంప్రదాయం విశిష్టతతో పాటు సమకాలీన సౌందర్యంతో ఆకర్షణీయమైన సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తుంది. ముఖ్యంగా ప్రతి ఫ్యాషన్ ఔత్సాహికుల కోరికలను తీర్చడానికి చీరలు, సౌందర్య ఉపకరణాల అద్భుత సేకరణను అందిస్తుంది. చీరల శ్రేణిలో ప్రత్యేకమైన బ్రైడల్ కలెక్షన్, ఫ్యాన్సీ, డిజైనర్ చీరల సేకరణతో పాటుగా మంగళగిరి చీరలు, మాస్టర్ డిజైన్‌లతో కూడిన కంచి పట్టు చీరలు, ఆర్గాన్జా చీరలు, బనారసీ చీరలు, పైథాని, గద్వాల్ చీరలు, కాటన్ లు మొదలైనవి ఉన్నాయి. ఇక్కడ చీరల ధరలు అందరికీ అందుబాటులో రూ .695 నుంచి 2,00,000 వరకు ఉంటుంది. లాంచ్‌కు హాజరైన అతిథులు సఖి, ది హౌస్ ఆఫ్ కంచి వీవ్స్ ప్రోత్సాహన్ని, మద్దతును తెలిపారు. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా సఖి, ది హౌస్ ఆఫ్ కంచి వీవ్స్ వ్యవస్థాపకులు రావులపల్లి దుర్గా చంద్రశేఖర్, రావులపల్లి సాయికృష్ణ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. "మా కొత్త స్టోర్‌ను ప్రారంభించినందుకు మా అతిథులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. మేము ఆకర్షణీయమైన, సున్నితమైన, సౌందర్యవంతమైన చీరల విస్తృతమైన ఎంపిక కోసం ఏకైక గమ్యస్థానంగా నిలవనున్నం. మా కొత్త స్టోర్‌కి విచ్చేసి అన్ని రకాల భారతీయ వస్త్రాలు, ఫ్యాన్సీ చీరలు, ప్రత్యేకమైన మ్యారేజ్ కలెక్షన్ లో ఈ అభిరుచులకు తగిన వస్త్రాలను ఎంపిక చేసుకోవచ్చు. కంచి పట్టు మొదలు



దేశవ్యాప్తంగా ఉన్న విభిన్న రకాల అత్యుత్తమ విశిష్టమైన చేనేత వస్త్రాలు మా వద్ద అందుబాటులో ఉన్నాయి. మా స్వంత మగ్గాల కారణంగా వినియోగదారులకు నాణ్యత, ధరల ప్రయోజనాలను అందించడానికి అవకాశముంది. ఏ ఎస్ రావు నగర్, ఇక్కడి సమీప ప్రాంతాల ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకోవడం మాకు చాలా సంతోషంగా ఉంద"ని వారు తెలిపారు. ఈ గ్రాండ్ ఓపెనింగ్ ఈవెంట్‌కు ఫ్యాషన్ ప్రియులు, స్థానిక ప్రముఖులు, గౌరవనీయమైన సభ్యులతో సహా విభిన్న ప్రేక్షకులు హాజరయ్యారు. అతిథులు సఖి, ది హౌస్ ఆఫ్ కంచి వీవ్స్ యొక్క విలాసవంతమైన స్టోర్ కు విచ్చేయడానికి, ఇక్కడి అద్భుతమైన సేకరణలను కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారని వారు తెలిపారు

# తెలంగాణలో దంచికొడుతున్న వానలు.. స్తంభించిన జనజీవనం

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. సిటీతో పాటు జిల్లాల్లో వానలు కురుస్తున్నాయి. ఉత్తర జిల్లాల్లో వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు పడుతున్నాయి. ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో వర్షాలకు

వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్నిజిల్లాల్లో వాగుల ఉధృతికి గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి.జనజీవనం స్థంభించిపోయింది. మరోవైపు తెలంగాణతో పాటు ఎగువ రాష్ట్రాల్లో వర్షాలకు ప్రాజెక్టులకు భారీగా వరద పోటెత్తుతుంది.



బంగాళాఖాతాంలోవాయుగుండంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర జిల్లాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవ హిస్తున్నాయి. లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల రోడ్లు తెగి రాకపోకలు బంద్ అయ్యాయి. ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక సిటీలో ఉదయం నుంచి ముసురు వర్షం కురుస్తోంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఎడతెరిపిలేని వర్షాలకు జనజీవనం స్థంభించింది.ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. మహబూ బాబాద్ జిల్లాలో మున్నేరువాగుకి భారీగా వరద చేరుకుంటుంది. బయ్యారం పెద్ద చెరువు, మాదన్నపేట, పాకాల చెరువులు మత్తడిపోస్తున్నాయి. ఖమ్మం జిల్లాలోనూ పలు ప్రాంతాల్లో జోరుగా వర్షం కురుస్తోంది.

ర్రుపాలెం మండలంలో కుండపోతవానలకు... నర్సింహాపురం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మధిర నియోజకవర్గంలో వర్షం బీభత్సం సృష్టించింది. మధిర మున్సిపాలిటీలో మోకాళ్ల లోతు వరద నీరు చేరింది. ఇళ్లలోకి వరదనీరు రావడంతో జనం ఇబ్బందిపడ్డారు. కృష్ణాపురం దగ్గర పాలవాగు ఉధృతికి పంటపొలాలు నీటమునిగాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుండాలలో ఏడు మెలికల వాగు ఉధృతికి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

నల్గొండ జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. మిర్యాలగూడలో రోడ్లపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా వర్షానికి రహదారులు, లోత ట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గ్రామాల్లో చెరువులు,కుంటలు అలుగుపారుతున్నాయి. త్రిపురాం మండలం బాబుసాయి పేట దగ్గర కుక్కడం – త్రిపురరాం ప్రధాన రోడ్డుపై వరద నీరుప్రవహిస్తుంది. దీంతో 4 మండలాలకు రాకపోకలు నిలిచిపోవడంతో అవస్థలు పడ్డారు జనం. కోదాడ వద్ద హైదరాబాద్ , విజయవాడ జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయింది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో కుండపోత వానలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఊట్కూరు మండలం మల్లేపల్లిలో వరద ప్రవాహంలో కారు చిక్కుకుపోయింది. జడ్చర్లలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణమంతా వరద నీటి మయమైంది. ఆస్పత్రిలోకి వెళ్లడానికి వీలు లేకుండా ఉల్లివాగు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది.

నారాయణపేట జిల్లాలో సింగారం వాగు మత్తడి పోస్తోంది. అటు నాగర్ కర్నూల్ జిల్లాలోని ధన్వాడ మండలం పాతపల్లిలో రోడ్లపై వరద ఉప్పొంగుతోంది. సిరసవాడ దగ్గర దుందుభి వాగు ఉధృతికి రాకపోకలు బంద్ అయ్యాయి. ధన్వాడలో ఇవాళ ప్రమాదకరంగా ప్రవహిస్తోన్న వాగును దాటికి స్కూళ్లకు వెళ్లారు విద్యార్థులు.

హైదరాబాద్ సిటీలోనూ ఉదయం నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. ఇవాళ ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్, అబ్దుల్లాపూర్ మెట్ ఏరియాల్లో చిరుజల్లులు కురిశాయి. సికింద్రాబాద్, ముషీరాబాద్, చిక్కడపల్లి, నారాయణగూడ, హిమాయత్ నగర్, బషీర్ బాగ్, అబిడ్స్, కోఠి, బేగంబజార్ ఏరియాల్లో మోస్తరు వానకురిసింది. సిటీ శివార్లలోనూ వర్షం పడింది.

కుత్బుల్లాపూర్, సుచిత్ర, కొంపల్లి, దుండిగల్, గండిమైసమ్మ, జీడిమెట్ల సహా పలు ఏరియాల్లో మోస్తరు వర్షం పడింది.రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ లో తంగడపల్లి వెంకిర్యాల వాగు ఉధృతికి రాకపోకలు స్థంభించాయి. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం మండలాల్లో మోస్తరు వానకురిసింది. మేడ్చల్ జిల్లాలోనూ అక్కడక్కడ వర్షం కురిసింది.

తెలంగాణతో పాటు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కృష్ణానదిపై ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చిచేరుతుంది. జూరాల నుంచి శ్రీశైలంకు భారీగా ఇన్ ఫ్లో వస్తోంది. 3లక్షల 26 వేల 481 క్యూసెక్కుల వరద వస్తుండటంతో.. 8గేట్లు ఎత్తి 3లక్షల 499 క్యూసెక్కుల నీటిని సాగర్ కు రిలీజ్ చేస్తున్నారు అధికారులు. శ్రీశైలంనీటిమట్టం, నీటినిల్వ సామర్థ్యం పూర్తిస్థాయికి చేరింది. శ్రీశైలం నుంచి నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీగావరద పోటెత్తుతుంది.దీంతో ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరింది. సాగర్ కు ప్రస్తుతం 3లక్షల 35 వేల 596 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. దీంతో 26గేట్లు ఎత్తి 3లక్షల 35 వేల 586 క్యూసెక్కుల వాటర్ ను రిలీజ్ చేస్తున్నారు అధికారులు.సాగర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 312టీఎంసీలుకాగా.. ప్రస్తుతం308.7టీఎంసీల నీరుంది.

# రూ. 75 కోట్ల ప్రభుత్వ భూమిని.. కబ్జా చేసిన బీజేపీ కార్పొరేటర్


**హైదరాబాద్ పెన్ పవర్:**చెరువులు కబ్జా చేసిన వారిపై హైడ్రా కొరడా ఝులిపిస్తోంది. ఫిర్యాదు అందిన వెంటనే కూల్చివేతలు మొదలు పెడుతున్నారు. ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ లో ఎక్కడ నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తోంది.

లేటెస్ట్ గా మైలార్ దేవ్ పల్లి బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అక్రమ కట్టడాలను కూల్చేశారు హైడ్రా అధికారులు. అప్ప చెరువు ఎఫ్ టీఎల్ లో నిర్మించిన కట్టడాలను నేలమట్టం చేశారు. భారీ బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను తొలగించారు . 3 ఎకరాల చెరువు కబ్జాకు పాల్పడ్డట్లు తోకల శ్రీనివాస్ రెడ్డిపై ఆరోపణలు వచ్చాయి. దీని విలువ రూ. 75 కోట్లు ఉంటుందని చెప్పారు అధికారులు. దీంతో 13 భారీ కట్టడాలను నేలమట్టం చేశారు హైడ్రా అధికారులు. ఇప్పటికే హైడ్రా అధికారులు బాచుపల్లి,నిజాంపేట, శేర్లింగంపల్లి,మియాపూర్ లో ఎఫ్ టీఎల్ ,బఫర్ జోన్ లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చేశారు అధికారులు.



నోటీసులివ్వకుండానే కూల్చివేస్తామని చెబుతున్నారు అధికారులు.

## 30 ఏళ్ల కింద అన్ని అనుమతులిచ్చి..ఇపుడు కూలుస్తారా.?: దుర్గం చెరువు అమర్ సొసైటీ



**హైదరాబాద్ పెన్ పవర్:**జీహెచ్ ఎంసీ నుంచి అన్ని అనుమతులు తీసుకున్నామని దుర్గం చెరువు అమర్ సొసైటీ సభ్యులు వెల్లడించారు. 1991 అప్రూవల్ లే ఔట్ అయ్యిందని.. అందులో 140 ఫ్లాట్స్ ఉన్నాయని చెప్పారు. 30 ఏళ్ల కింద కట్టుకున్న తమను 30 రోజుల్లో ఖాళీ చేయాలంటే ఎలా అని ప్రశ్నించారు. GHMC అన్ని అనుమతులు ఇచ్చింది. రిజిస్ట్రేషన్ చేసుకొని లోన్స్ తీసుకొని ఇల్లులు నిర్మించుకున్నాం. అన్ని అనుమతులు తీసుకున్నాం. 2020 లో ఫ్లడ్స్ వచ్చాయి.. గత ప్రభుత్వం మా ఫ్లాట్స్ FTL పరిధిలోకి రావని చెప్పింది. ప్రభుత్వాలు మారితే ఆధారాలు, భూమి సంబందించిన కాగితాలు మారవు కదా.?. మేము అనుమతి తీసుకుంది 1991లో అప్పుడు FTL.. బఫర్ జోన్ లు అంశం లేదు. అప్పట్లో దుర్గం చెరువు ఎంత ఉంది ఇప్పుడు ఎంత ఉందనేది అన్ని వివరాలు మా దగ్గర ఉన్నాయి. 30 రోజుల్లో ఖాళీ చేయాలనీ నోటీసులు ఇచ్చారు. ఇన్ని సంవత్సరాలనుంచి ఉంటున్న మమ్మల్ని 30 రోజుల్లో ఖాళీ చేయాలనీ ఎలా చెబుతారు.? అన్ని డిపార్ట్మెంట్ నుంచి అనుమతి తీసుకున్నాం. వాల్టా చట్టం రాక ముందే మేము అన్ని అనుమతులు తీసుకున్నాం. అని అమర్ సొసైటీ సభ్యులు తెలిపారు. దుర్గం చెరు పరిధిలో ఎఫ్ టీఎల్ లో నిర్మాణాలు చేపట్టిన 204 మందికి శేర్లింగంపల్లి తహసీల్దార్ అధికారులు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే.. నోటీసులు అందుకున్న వారిలో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి కూడా ఉన్నారు. ఇంకా పలువురు సినీ,రాజకీయ ప్రముఖులు ఉన్నారు.

## పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో.. నూతన రైల్వే లైన్ ఏర్పాటుకు కృషి చేస్తా




**హైదరాబాద్ పెన్ పవర్:**పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో నూతన రైల్వే లైన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు ఎంపీ గడ్డం వంశీకృష్ణ. 8 వేల కోట్లతో రామగుండం జెన్కో లో సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. పట్టువదలని విక్రమార్కుడు రాజ్ ఠాకూర్.. పవర్ ప్లాంట్ ఏర్పాటు శుభపరిణామం అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో సుమారుగా 2వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయని చెప్పారు.

ప్లాంట్ నిర్మాణం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. అలాగే కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి పార్లమెంట్ లో మాట్లాడినట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్టాన్ని అప్పుల పాలు చేసిందన్నారు వంశీకృష్ణ. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందన్నారు.

**సింగరేణి కార్మికులకు అన్యాయం: శ్రీధర్ బాబు**

కొత్త విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే మక్కన్ సింగ్ కృషి ఎంతో ఉందన్నారు మంత్రి శ్రీధర్ బాబు. 8 వేల పై చిలుకు కోట్లతో ప్లాంట్ నిర్మాణానానికి ప్రభుత్వం ప్రకటన చేయడం సంతోషమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొకటిగా పూర్తి చేస్తామన్నారు. రామగుండం ప్రాంతంలో నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగాల కల్పన చేయబోతున్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు నింపే ప్రయత్నం చేయబోతున్నామని తెలిపారు. గత బీఅర్ఎస్ ప్రభుత్వం హయాంలో సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు శ్రీధర్ బాబు


## కోతుల హంగామా



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ సూర్యాపేట, ఆగష్టు31:**నూతనకల్ మండల కేంద్రంలో కోతులు భీభత్సం సృష్టించాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా వందల సంఖ్యలో కోతులు ఊరిని రౌండప్ చేసేసాయి. రెండు గ్రూపులుగా వీడిపోయి.. రచ్చ చేసిన వానర యుద్ధం కిష్కిందకాండ ను తలపించింది. సుమారు రెండు గంటల పాటు అరుపులు, కేకలతో నానా హంగామా చేసాయి. వందల సంఖ్యలో కోతులను చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఎక్కడ దాడి చేస్తాయోనని హడలి పోయారు. చివరకు పట్టణ వాసులంతా ఏకమై కర్రలతో ప్రతిఘటించడంతో.. అక్కడి నుంచి మెల్లగా జారుకున్నాయి.

అప్పటికే పలు ఇండ్లపై రేకులను ధ్వంసం చేసి గ్రామస్థులకు కొంత ఆస్తి నష్టం మిగిల్చింది వానర సైన్యం.

## సాగర్ కు కొనసాగుతున్న వరద ప్రవాహం



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ నల్గొండ, ఆగష్టు31:** నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. 26 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు. ప్రస్తుత నీటి మట్టం 589.00 అడుగులు. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం..312 టిఎంసిలు. ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 309.0570 టిఎంసిలు. ఇన్ ఫ్లో :2,95,390 క్యూసెక్కులు. ఔట్ ఫ్లో : 3,12,682 క్యూసెకులు.

## పార్శ్వనాధుని విగ్రహం చోరీ

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ మెదక్, ఆగష్టు31 :**టేక్ మాల్ మండలం వెల్పుగొండ గుట్టపై పార్శ్వనాధుని విగ్రహం చోరీ అయింది. గతంలోనూ పలుమార్లు ఆ విగ్రహం చోరీకి దుండగులు ప్రయత్నించారు. మేకల కాపరి సమాచారంతో విగ్రహం చోరీ వెలుగులోకి వచ్చింది. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెల్పుగొండలోని గుట్టపై కాకతీయుల కాలంలో నిర్మించిన తుంబురీశ్వర ఆలయం ఉంది. దీనికి ఎదురుగా ఉన్న చెరువు మధ్యలో దేవతల గుట్ట ఉంది. దీనిపై క్రీ.పూ. 5వ శతాబ్దానికి చెందిన పార్శ్వనాథుడి విగ్రహం ఉండేది. 40 రోజుల క్రితం సూరం పల్లి గ్రామానికి చెందిన బ్రహ్మం ఆ విగ్ర హాన్ని అక్కడే చూశాడు. శుక్రవారం మేకల మేత కోసం సాయిలుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి గుట్టకు వెళ్లారు. ఆ ప్రాంతంలో తాళ్లు, వాహనాల టైర్లు, కర్రలు ఇతర సామగ్రి ఉండడంతో అనుమానం వచ్చి విగ్రహం కోసం వెతకగా కనిపించలేదు. వెల్పుగొండ మాజీ సర్పంచి నారాయణ ఫిర్యాదుతో ఎఎస్సై అక్కడికి చేరుకొని వివరా లు సేకరించి కేసు నమోదు చేశారు. గతేడాది జులైలో ఇదే విగ్ర హాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించి విఫలమయ్యారు

# తాడిపత్రిలో జేసీ మార్క్ రాజకీయం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ అనంతపురం, ఆగష్టు 31::** ఆ నియోజకవర్గంలో నేతలు ఏమి మాట్లాడినా ఏపీ మొత్తం అటెన్షన్ లోకి వస్తుంది. అధికారం ఎవరిది ఉన్న వారికి సంబంధం ఉండదు. వారి స్టైల్లో నేతల మాటలు దూకుడు కొనసాగుతూనే ఉంటాయి. ఒకరికి మించి ఒకరు ఎవరు తగ్గే పరిస్థితి కనిపించదు. ఆ నియోజకవర్గమే తాడిపత్రి. ప్రస్తుతం ఇసుక మాఫియాని అడ్డుకోవాలని అధికార పార్టీ ఎమ్మెల్యేనే సీన్లోకి దిగడంతో ఒక్కసారిగా స్టేట్ మొత్తం తాడిపత్రి వైపు చూసింది.జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ అస్మిత్ రెడ్డి అంటేనే గుర్తుకువచ్చేది తాడిపత్రి నియోజకవర్గం. ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. దశాబ్దాలుగా తాడిపత్రి రాజకీయాన్ని సాసిచ్చింది జేసీ ఫ్యామిలీ. జేసీ దివాకర్ రెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డి (జేసీ బ్రదర్స్) ఈ రెండు పేర్లు తెలియని వారు ఉండరు. అలా వారు తాడిపత్రిని కంచుకోటలాగా మార్చుకున్నారు. 2019 వరకు తిరుగులేదన్నట్లుగా నియోజకవర్గ రాజకీయాలను కనుసైగతో పాలించిన జేసీ ప్యామిలీకి 2019 లో వైఎస్ జగన్ మేనియాలో ఎదురు దెబ్బ తగిలింది. జగన్మోహన్ రెడ్డి వేవ్ లో తాడిపత్రి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డి గెలుపొందారు. అక్కడి నుంచి మొదలైన నేతల వార్ నేటికీ కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా తాడిపత్రి నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా, అక్రమ కేసుల వ్యవహారమే వివాదాలకు కేంద్ర బిందువు అవుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెన్నానది నుంచి ఇసుక అక్రమ తరలింపునకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి ఆందోళన చేశారు. పెద్దపప్పూరు మండలం లో పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న జేసీ ప్రభాకరరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని పలు స్టేషన్ల చుట్టూ రోజంతా తిప్పారు. ఇలా ఇసుక అక్రమ రవాణా, కేసుల వ్యవహారమే తాడిపత్రి నియోజకవర్గంలో అప్పట్లో రాజకీయ దుమారం రేపింది. అప్పటి ప్రభుత్వంలో నియోజకవర్గ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కనుసుందరిలోనే అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని జేసీ ప్రభాకర్ రెడ్డి బహిరంగంగానే ఆరోపించారు. వాటిని సాక్షాలతో సహా నిరూపిస్తా అంటే కూడా సవాల్ చేశారు. అనుకున్న స్థాయికి మించి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఏకంగా ఇసుక రీచ్ల వద్ద జేసీ ప్రభాకర్ రెడ్డి కూర్చున్నారు. ఈ



క్రమంలోనే గత ప్రభుత్వంలో జేసీ ప్రభాకర్ రెడ్డిపై కేసులు కూడా నమోదు చేశారు. గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణా ను కచ్చితంగా అడ్డుకొని తీరుతానని జేసీ ప్రభాకర్ రెడ్డి సవాల్ చేశారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేస్తానని చెప్పడం తెలిసిందే. అనుకున్నట్లే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ.. తాడిపత్రి నియోజకవర్గంలో ఇసుక మాఫియా కొనసాగుతూనే ఉంది. దాంతో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఇసుక అక్రమ రవాణాను ఆపివేయాలని చెప్పినప్పటికీ, కొందరు తన మాట పెడచెవిన పెట్టి తమ వర్గంలోని కొందరు కూడా ఇసుకను ఆక్రమంగా రవాణా చేస్తున్నారు. దయచేసి మానుకోండి అని ఒక వీడియోలో సూచించారు. గత ప్రభుత్వంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై ప్రత్యక్షంగా పోరాడిన వాడిని నేను. గ్రీన్ ట్రిబ్యునల్ కు హైకోర్టు వరకు వెళ్లి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నానని ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా ఇది ఇలాగే కొనసాగితే ఎవరిని ఉపేక్షించేది లేదని బహిరంగంగానే చేసి ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు.తాడిపత్రి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు గెలుపొందిన నాటి నుంచి నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై పలు సందర్భాల్లో స్పందిస్తూ వస్తున్నారు. నియోజకవర్గంలోని ఇసుక డంపులు ఇసుక రీచులను కూడా ఎమ్మెల్యే జేసీ అస్మత్ రెడ్డి పరిశీలించారు ఇసుక రీచ్ లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారికి హెచ్చరికలు కూడా జారీ చేశారు ప్రభుత్వ అధికారులతో స్వయంగా ఎమ్మెల్యేని మాట్లాడి అక్రమంగా ఇసుకను తరలించే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అయినప్పటికీ నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుండడంతో అస్మిత్ రెడ్డి ఆగ్రహించారు. ఇసుక అక్రమ రవాణాను కట్టడిచేయడంలో భాగంగా జేసీ అస్మిత్ రెడ్డి ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేసి ఇసుక తరలింపుపై నిఘా వేశారు. అర్ధరాత్రి సమయాల్లో టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్న వాహనాలు అనుమతులతో తరలిస్తున్నారా లేక అక్రమంగా తరలిస్తున్నారనే దానిపై కాపు కాసి అక్రమంగా తరలిస్తున్న వారిని కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా ఆలూరు, సజ్జలదిన్నె, వీరాపురం సమీపం లోని పెన్నా పరివాహక ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ల లు జేసీ అస్మిత్ రెడ్డి టీం కంట పడ్డాయి. అస్మిత్ రెడ్డి టీం టిప్పర్ యజమానులు, ఇసుక తరలింపుదారుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరగడం, ఇసుక తరలింపుదారుల దాడిలో ఎమ్మెల్యే అనుచరులు ముగ్గురు గాయపడటంతో మరోసారి తాడిపత్రిలో ఇసుక వివాదం చోటుచేసుకుంది. ఇసుక టిప్పర్లను సీజ్ చేయకుండా రూరల్ సీఐ లక్ష్మీకాంత రెడ్డి వదిలిపెట్టారని, తమపై దాడి జరిగినా కేసు నమోదు చేయలేదంటూ అనుచరులు ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సీఐ లక్ష్మీకాంతరెడ్డికి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నవారిపై కేసు నమోదు చేయాలని సూచించారట. ఇదే విషయంతో తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంత్ రెడ్డితో వాగ్వాదం చోటు చేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్లు ట్రాక్టర్లపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే చెప్పినప్పటికీ సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి ఎమ్మెల్యే మాట పెడచెవిన పెట్టి ఇసుక మాఫియాతో కుమ్మక్కై ఇసుక దందాను కొనసాగిస్తున్నాడని జేసీ అస్మిత్ రెడ్డి ఆరోపించారు. ఇదే వ్యవహారంలో ఎమ్మెల్యేకు సీఐ క్షమాపణ చెప్పేంతవరకు వెళ్లింది.

# విజయవాడలో భారీ వర్షం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయవాడ, ఆగష్టు31:** విజయవాడలో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ద్విచక్ర వాహనాలు మరి కొన్ని గంటల పాటు రోడ్ల పైకి రావొద్దని పోలీసుల హెచ్చరికలు జారీ చేసారు. వివిఐపిలు ను బయటకు రావొద్దని పోలీసులు సూచించారు.. కొన్నా చోట్ల జాతీయ రహదారుల నుంచి సర్వీస్ రొడ్లలోకి వాహనాలను మళ్లించారు. జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలు అనుమతించ వద్దని పోలీసులు ఆదేశాలు ఇచ్చారు. వీఐపీల సెక్యూరిటీ సిబ్బందిని అలెర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. పొట్టిపాడు టోల్ గేట్ వద్ద జాతీయ రహదారిపై భారీ వాహనాలు నిలిచిపోయాయి. బెంజ్ సర్కిల్ వద్ద కుడా వాహనాలు భారీగా నిలిచాయి. నగరంలోని ప్రధాన రోడ్లపై మోకాలి లోతు నీళ్ళు చేరాయి. నగరంలోకి వచ్చే వాహనాలు మొత్తం మళ్లించారు. ఎస్కార్ట్ వాహనాలను ముందస్తు అనుమతి లేకుండా నగరంలోకి అనుమతించకూడదని సూచనలు ఇచ్చారు. బెంజ్ సర్కిల్ నుంచి ఆటో నగర్ వరకు ఎంజీ రోడ్డుపై వాహనాలు నిలిచాయి. మొఘల్ రాజ్ పురంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. ప్రధాన కూడళ్లలో ఫైర్ ఇంజన్ లతో నీళ్ళు తొలగించే ప్రయత్నాలు చూస్తున్నారు. పాతబస్తీలో ఔట్ ఫాల్ డ్రైయిన్ పొంగడంతో ఇళ్లలోకి నీరు చేరింది.

# తెలంగాణకు రెడ్ అలర్ట్ : ఈ జిల్లాల్లో కుండపోత వర్షాలు.. ఈ జిల్లాల్లో భారీ వర్షాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. రెండు రోజులపాటు ఈ రెడ్ అలర్ట్ ఉంటుందని స్పష్టం చేసింది. అంటే.. ఆగస్ట్ 31వ తేదీ, సెప్టెంబర్ ఒకటో తేదీన.. శని, ఆదివారాలు.. ఈ రెండు రోజులు అతి భారీ వర్షాలు పడనున్నట్లు హెచ్చరించింది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ప్రభావంతో కొన్ని చోట్ల కుండపోత వర్షాలు పడనున్నట్లు స్పష్టం చేసింది హైదరాబాద్ వాతావరణ శాఖ.

కుండపోత వర్షాలు పడే జిల్లాలు : జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు.. అంటే కుండపోతగా వర్షాలు పడనున్నాయి.భారీ వర్షాలు పడే జిల్లాలు : నల్గొండ, నాగర్ కర్నూలు, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్నాయి.మిగతా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఇప్పటి వరకు

అంటే.. ఆగస్ట్ 31వ తేదీ శనివారం మధ్యాహ్నం వరకు నారాయణపేటలో అత్యధికంగా 13 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడుతున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంగా ఈదురుగాలులు వీచే అకాశం ఉంది.

బంగాళాఖాతంలోని వాయుగుండం సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం తెల్లవారుజామున విశాఖపట్నం, గోపాలపూర్ ప్రాంతాల మధ్య తీరం దాటనుంది. వాయుగుండం తీరం దాటిన 24 గంటల వరకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడనున్నట్లు స్పష్టం చేసింది వెదర్ డిపార్ట్ మెంట్.

# జోగి రాజీవ్ తో శ్రేష్ట కర్మోజీ ఎవరు...



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయవాడ, ఆగస్టు 31:**అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో అరెస్టయ్యారు జోగి రాజీవ్. మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు. అమెరికాలో చదువుకున్న రాజీవ్ తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి రావాలని భావించారు. అనూహ్యంగా అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారంలో చిక్కుకున్నారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా భూములు దోచుకున్నారు అన్నది ఆయనపై ఆరోపణ. అయితే ఈ విషయంలో రాజీవ్ కు ఎటువంటి సంబంధం లేదని.. చిన్న కుర్రాడిని కేసుల్లో ఇరికిస్తారా అంటూ జోగి రమేష్ తో పాటు కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.అయితే జోగి రమేష్ కుమారుడికి ఇదివరకే రాజకీయాలతో సంబంధాలు ఉన్న విషయాన్ని కూటమి పార్టీలు బయటపెడుతున్నాయి.గతంలో ఆయన మాట్లాడిన వీడియోలను ప్రదర్శిస్తున్నాయి. మంగళగిరిలో లోకేష్ ను మట్టి కరిపించాలని.. చంద్రబాబు అరుదైన వ్యాధితో బాధపడుతున్నారని గతంలో రాజు వ్యాఖ్యానించారు. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది తెలుగుదేశం పార్టీ.అవి విపరీతంగా వైరల్ అయ్యాయి కూడా. అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు కేసులో ఇటీవల బయటకు వచ్చారు రాజీవ్. ఇటువంటి తరుణంలో మరో వార్త ఒకటి హైలెట్ అవుతోంది. సోషల్ మీడియాలో వీడియోలతో పాటు ఫోటోలు వైరల్ గా మారాయి. ఓ యువతితో జోగి రాజీవ్ సన్నిహితంగా ఉన్న దృశ్యాలు బయటపడ్డాయి.అదే సమయంలో కుటుంబ సభ్యుల సమక్షంలో ఆ యువతితో కూర్చున్న ఫోటోలు సైతం బయటపడ్డాయి.అయితే ఫోటోలను నిశితంగా గమనిస్తే మాత్రం.. నిశ్చితార్థం మాదిరిగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇవే హైలెట్ అవుతున్నాయి.జోగి రమేష్ జగన్ క్యాబినెట్లో మంత్రిగా వ్యవహరించారు. వైసీపీలో దూకుడు కలిగిన నేత. వైసిపి ప్రభుత్వ హయాంలో ఏకంగా చంద్రబాబు నివాసం పైనే దండెత్తారు. తరచూ చంద్రబాబుతో పాటు లోకేష్ పై అనుచిత కామెంట్స్ చేసేవారు. జగన్ పై వీర విధేయత ప్రదర్శిస్తూ ప్రత్యర్థులపై విరుచుకుపడేవారు. అందుకే కూటమి ప్రభుత్వం జోగి రమేష్ పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. ఆయన కుమారుడు జోగి రాజీవ్ అగ్రిగోల్డ్ భూములను కొనుగోలు చేయడంతో అడ్డంగా బుక్కయ్యారు. అందుకే అరెస్టయ్యారు.తన కుమారుడికి ఏమీ తెలియదని.. అసలు రాజకీయాలతో సంబంధమే లేదని జోగి రమేష్ తో పాటు ఆయన భార్య చెప్పుకొచ్చారు. ఆ భూముల వ్యవహారం ఏమిటో తమకు తెలియదని చెప్పారు. అయితే అందరి మాదిరిగానే తాము అగ్రిగోల్డ్ భూములను కొనుగోలు చేశామని.. అందులో తప్పేమిటని రాజీవ్ ప్రశ్నిస్తున్నారు. అయితే రాజీవ్ కు రాజకీయాలతో సంబంధం లేదని జోగి రమేష్ కుటుంబం చెప్పే ప్రయత్నం చేయగా.. గతంలో రాజీవ్ చేసిన కామెంట్స్ ను టిడిపి హైలెట్ చేసింది. దీంతో సోషల్ మీడియా వేదికగా పెద్ద దుమారమే నడిచింది. అయితే ఆ వ్యవహారం సద్దుమణగగా.. ఇప్పుడు కొత్తగా ఎవరితో రాజీవ్ కు నిశ్చితార్థం జరిగిందని ప్రచారం ప్రారంభమైంది.అయితే తాజాగా వస్తున్న ప్రచారం బట్టి రాజీవ్ తో ఉన్న యువతి పేరు శ్రేష్ట కర్మోజిగా తేలింది. ఆమె ప్రముఖ క్రిస్టియన్ మత ప్రబోధకుడు శామ్యూల్ కర్మోజి కుమార్తెగా తేలింది. విశాఖలో ప్రముఖ చర్చి వ్యవస్థాపకుడు కూడా ఆయన. జోగి రమేష్ కు సామ్యూల్ కర్మోజికి చాలా రోజులుగా సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఇరు కుటుంబాలు రాజీవ్, శ్రేష్ట కర్మోజిలకు పెళ్లి చేయడానికి సమ్మతించినట్లు ప్రచారం జరుగుతోంది. నిరాడంబరంగా నిశ్చితార్థ వేడుకలు పూర్తి చేశారని..అందుకే ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వచ్చాయని తెలుస్తోంది. రాజీవ్ కష్టాల్లో ఉంటే.. శ్రేష్ట కర్మోజి ధైర్యం చెప్పేందుకు ఆ ఫోటోలు సోషల్ మీడియాలో పెట్టారని ఒక ప్రచారం అయితే జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

## రహదారులు జలమయం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ మైలవరం, ఆగష్టు31:** శుక్రవారం కురుస్తున్న భారీ వర్షానికి నియోజకవర్గ వ్యాప్తంగా రహదారులు జలమయం అయ్యాయి. వరద నీరు పల్లపు ప్రాంతాల్లో ఇళ్ళలోకి చేరుతోంది. కొండపల్లి వద్ద విజయవాడ ఛత్తీస్గఢ్ జాతీయ రహదారిపై వరద నీరు భారీగా చేరడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. మైలవరం తారకరామా నగర్ లో ఇళ్ళల్లోకి వర్షపు నీరు చేరింది. జి.కొండూరు మండలం గురాజుపాలెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుతో గురాజుపాలెం గ్రామానికి రాకపోకలు బంద్అయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో శనివారం నేడు పాఠశాలలకు ప్రకటించారు.


## గణేష్ ఉత్సవాలకు అన్నీ ఏర్పాట్లు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ మేడ్చల్ ఆగష్టు31 :** గ్రేటర్ హైదరాబాద్ లో జరిగే వినాయక నవరాత్రి ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. ఈ రోజు నగరంలోని అన్ని జొన్లలో పర్యటించి ఆయా ప్రాంతాల్లోని చెరువుల వద్ద జరుగుతున్న వినాయక నిమర్జన ఏర్పాట్ల పనులను పరిశీలించినట్లు మేయర్ తెలిపారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చేస్తున్న ఏర్పాట్లకు స్థానిక ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సహా వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు రాజ్ జితేందర్ నాథ్, చింతల విజయశాంతి పాల్గొన్నారు.

## కారు బీభత్సవం?
## ఆటో, కారు ధ్వంసం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ హైదరాబాద్, ఆగష్టు31:** బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 లో కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చిన కారు లుంబిని మాల్ కమర్షియల్ కాంప్లెక్స్ పార్కింగ్ లో ఉన్న వాహనాలతోపాటు ఆటోను ఢీ కొట్టి పల్టి కొట్టింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడా లేక మద్యం మత్తులో ర్యాస్ డ్రైవింగ్ చేయడంతో ప్రమాదం జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తన్నారు

## భారీ వర్షాలకు బొగ్గు ఉత్పత్తికి ఆటంకం



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ ఖమ్మం, ఆగష్టు31:**రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షం వల్ల జె.వి.ఆర్ ఓపెన్ కాస్ట్ లో 83 మిమీ వర్షపాతం నమోదు అయింది. కిష్టారం ఓపెన్ కాస్ట్ లో 59 మిమీ వర్షపాతం నమోదు. 5000 టన్నులు బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. 25000 క్యూబిక్ మీటర్లు మట్టి వెలికితీత పనులకు ఆటంకంకలిగింది. భారీ వర్షం వల్ల సింగరేణిలో 35 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి 1,65,000 క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు కార్యక్రమాలకు అంతరాయంకలిగింది

## బిలీయనీర్స్ లో ముంబై తర్వాత హైదరాబాదే...




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ హైదరాబాద్, ఆగస్టు 31:** ఇండియాలో బిలియనీర్లు పెరుగుతున్నారా? స్టాక్ మార్కెట్ రాకెట్ మాదిరిగా దూసుకుపోతోంది.. మరి బిలియనీర్ల మాటేంటి? ఇండియాలో ఎవరు కుబేరులయ్యారు? టాప్‌లో ఏ సిటీ ఉంది? ఇందులో హైదరాబాద్ స్థానమెంత? చివరి స్థానం ఎవరు? చాలామంది టాప్ ఉన్నతస్థాయి వర్గాలు చర్చించుకుంటున్నాయి. తాజాగా హురూన్ ఇండియా ఫుల్‌స్టాప్ పెట్టిందా? లోతుల్లోకి వెళ్దాం..చైనా రాజధాని బీజింగ్ బిలియనీర్లు కేరాఫ్‌గా మారింది. చైనా రాజధాని బీజింగ్ నుంచి ఎక్కువ మంది బిలియనీర్లు వచ్చేవారు. దాన్ని అధిగమించింది ముంబై సిటీ. ఒకప్పుడు బీజింగ్ నుంచి 91 మంది రాగా, ముంబై 92 మంది బిలియనీర్లకు కేరాప్‌గా మారింది.ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బిలియనీర్ రాజధానిగా ముంబై మారింది. ప్రపంచంలో బిలియనీర్ల పరంగా చూస్తే న్యూయార్క్ (119) తొలి స్థానం, లండన్ (97) తర్వాత మూడవ స్థానంలో ముంబై నిలిచింది. మరో నాలుగేళ్లలో సెకండ్ ప్లేస్‌కు ముంబై చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2014 పేరుతో దేశంలోని కుబేరుల జాబితాను విడుదల చేసింది. ఇండియాలో అత్యంత సంపద కలిగిన వ్యక్తిగా బిజినెస్ మేన్ అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ టాప్ వన్‌లో నిలిచారు. సంపద విలువ ఏడాది కాలంలో 95శాతం పెరిగి అక్షరాలా 11.6 లక్షల కోట్లకు చేరింది. ఆ తర్వాత ముకేష్ అంబానీ 10.14 లక్షలో సెకండ్ ప్లేస్‌లో నిలిచారు.పదేళ్ల కిందట టాప్ -10లో ఉండే అదానీ, ఇప్పుడు ఫస్ట్ ప్లేస్ దక్కించుకున్నారు. ఆ తర్వాత హెచ్‌సీఎల్ అధినేత శివనాడార్, సీరమ్ ఇన్ స్టిట్యూట్, సన్ ఫార్మాలు వరుసగా మూడు, నాలుగైదు స్థానాల్లో నిలిచారు. రాష్ట్రాల పరంగా చూస్తే కుబేరుల జాబితాలో మహారాష్ట్ర తొలిస్థానం సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు వరసగా నిలిచాయి. టాప్ 10లో ఏపీ చోటు దక్కలేదు. నాలుగేళ్ల కిందట ఆరో స్థానంలో నిలిచిన తెలంగాణ.. ఇప్పుడు ఐదుకి ఎగబాకింది.బిలియనీర్లకు కేరాఫ్‌గా మెట్రోపాలిటిన్ సిటీలు నిలుస్తున్నాయి. 386 మంది బిలియనీర్లతో ముంబై అగ్రస్థానం దక్కించుకుంది. నాలుగేళ్ల కిందట 217 మంది మాత్రమే ఉండేవారు. సెకండ్ ప్లేస్‌లో న్యూఢిల్లీ నిలిచింది. 217 మంది బిలీయనీర్లు అక్కడి నుంచి వచ్చారు. నాలుగేళ్ల కిందట అందులో సగం ఉండేది.కుబేరులకు కేంద్రంగా మారుతోంది హైదరాబాద్. ధనవంతుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూ వస్తోంది. నాలుగేళ్ల కిందట కేవలం హైదరాబాద్ నుంచి 50 మంది మాత్రమే ఉండేవారు.. ప్రస్తుతం 104 మంది బిలియనీర్లు ఉన్నారు. ఈ విషయంలో బెంగూళూరును వెనక్కి నెట్టేసింది. దీని తర్వాత బెంగుళూరు 100 మందితో నాలుగులో స్థానంలో నిలిచింది. తర్వాత చెన్నై నిలిచింది.తెలంగాణ నుంచి దివీస్ లేబరేటరీస్, పిచ్చిరెడ్డి-మేఘా ఇంజనీరింగ్, కృష్ణారెడ్డి-మేఘా ఇంజనీరింగ్, పార్థసారథి-హెటెరో ల్యాబ్స్, అపర్ణ కన్ స్ట్రక్షన్స్, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ వంటి కంపెనీలు నిలిచాయి. కొత్తగా ఏర్పడిన తెలంగాణ బలమైన ఆర్థిక శక్తిగా నిలుస్తోందని చెప్పవచ్చు.

## గగన్ పహడ్ లో హైడ్రా కూల్చివేతలు

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ రంగారెడ్డి, ఆగష్టు31:** రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని గగన్ పహాడ్ వద్ద ఇందిరాగాంధీ సొసైటీ లో హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేసారు. భారీ బందోబస్తు మధ్యన అప్ప చెరువు ఎఫ్టిఎల్, బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. వర్షంలోనూ కూల్చివేతలు కొనసాగాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇందిరాగాంధీ సొసైటీలో పెద్ద ఎత్తున పరిశ్రమల షెడ్ల నిర్మాణం వ్యాపారులు చెపట్టారు. అక్రమ నిర్మాణదారులకు వివిధ పార్టీల రాజకీయ నేతల అండదండలు ఉన్నట్లుగా ఆరోపణలు వచ్చాయి.

# నిద్రపోనివ్వని హైడ్రా

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ హైదరాబాద్, ఆగస్టు 31:** ఒకవైపు హైడ్రాపై చర్చలు జరుగుతున్న సమయంలో.. ఆ సంస్థ ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. పొద్దు పొద్దున్నే వాలిపోతోంది. రాత్రి నిద్ర పోయిన వారుతెల్లవారి కళ్లు తెరిచేలోగానే హైడ్రా కూల్చివేతలు పూర్తి చేసేస్తోంది. నిజానికి ఈ కూల్చివేతల సమయంలో అడ్డుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. న్యాయ స్థానం మెట్లు ఎక్కేందుకు చూస్తున్నారు. కానీ.. కోర్టుల్లో పిటిషన్ వేసే లోగానే హైడ్రా పని చేసేస్తోంది. దీంతో వారికి ఊరట లభించడం లేదన్న వాదన వినిపిస్తోంది.ఎన్కన్వెన్షన్ విషయంలోనూ ఇదే జరిగింది. తెల్లవారు జామున 5 గంటలకే రంగం లోకి దిగిన హైడ్రా ఎన్ కన్వెన్షన్‌ను నేల మట్టం చేసింది. ఈ వ్యవహారం బయటి ప్రపంచానికి తెలిసే సరికే.. పావు వంతు కూల్చివేతలు అయిపోయాయి. ఇక, నాగార్జున మేల్కొని హైకోర్టుకు వెళ్లి.. స్టే తెచ్చుకు నే సరికి కాగల కార్యాన్ని హైడ్రా పూర్తి చేసేసింది. నాలాలు, చెరువులు, సరస్సులు(లేక్స్) ఆక్రమించుకుని కట్టుకున్నవారికి తగిన శాస్తి జరిగిందని కొందరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కానీ, ఇదే సమయంలో గత అధికారులు ఇచ్చిన అనుమతుల మేరకే తాము నిర్మించామని.. తప్పు తమది కాదని వాదించేవారు.. తమకు కనీసం సమయం




ఇవ్వకుండా ఇంత దూకుడు అవసరమా? అని వాపోతున్నారు. పైగా న్యాయ పోరాటానికి కూడా సమయం ఇవ్వకుండా చేయడాన్ని నిరసిస్తున్నారు.

ఇక, తాజాగా హైడ్రా అధికారులు సికింద్రాబాద్ నడిబొడ్డున ఉన్న రాంనగర్ పై పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలోని అడిక్‌మెట్‌లో నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేశారంటూ.. వాటిని శుక్రవారం తెల్లవారు జాము నుంచే కూల్చివేయడం ప్రారంభించారు.వాస్తవానికి ఈ నిర్మాణాలను రెండు రోజుల కిందట హైడ్రా కమిషనర్ రంగనాథ్ చూసి వెళ్లారు. దీనిపై నివేదిక తెప్పించుకున్నారు. అయితే.. ఈ పరిణామాలతో సదరు నిర్మాణాల యజమానులు.. నోటీసులు ఇస్తారు లే.. అప్పుడు చూసుకుందాం.. అని భావించారు. కానీ.. ఉరుములు లేని వర్షంలా.. హైడ్రా శుక్రవారమే విరుచుకుపడింది. ఉదయం ఈ వార్త బయటకు వచ్చే సరికే.. నిర్మాణాల కూల్చి వేతలు పూర్తయ్యాయి. అయితే.. ఈ వ్యవహారంపైనా మిశ్రమ స్పందన వస్తుండడం గమనార్హం. తమకు అవకాశం ఇవ్వకుండానే ఇలా చేయడం ఏంటని యజమానులు చెబుతున్నారు.

## వినాయకచవితి పండుగ వెనుకున్న పరమార్థం ఇదే.

సెప్టెంబరు 07 న వినాయక చవితి. ప్రతి ఇంట్లో వినాయకుడు కొలువుతీరుతాడు.. మండపాల్లో భారీ గణపయ్యలు పూజలందుకుంటారు. ఇంతకీ ఆ రూపం వెనుకున్న పరమార్థం ఏంటో తెలుసా...

వినాయక చవితి రోజు నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకుని గంగమ్మ ఒడికి చేరుతాడు గణనాథుడు. ఆ తొమ్మిదిరోజులు ఊరూవాడా సంబరమే...చిన్నా పెద్దా అందరూ భాగస్వాములే. సాధారణంగా పండుగ అంటే ప్రతి ఇంటా ఉత్సాహం వెల్లివిరుస్తుంది. సాధారణంగా పండుగ అంటే ప్రతి ఇంట్లో ఉత్సాహాన్ని నింపుతుంది..వాస్తవానికి ఉత్సాహం మాత్రమే కాదు మార్పు మొదలవ్వాలి. భక్తిశ్రద్ధలతో పూజలు చేయడమే కాదు..ఆ రూపం వెనుకున్న ఆంతర్యం తెలుసుకోవాలి..ఏం నేర్చుకోవాలి? ఎలాంటి మార్పులు రావాలో నేర్చుకోవాలి, పిల్లలకు తెలియజేయాలి.

బొజ్జ గణపయ్య, లంబోదరుడు, వినాయకుడు, గణనాథుడు, పార్వతీ తనయుడు ఇలా రకరకాల పేర్లతో పిలిచే ఆ రూపం వెనుక ఎంతో తాత్వికత ఉంది. సాధారణంగా వినాయకుడు అనగానే పెద్ద పొట్ట, పెద్ద చెవులు, పొట్ట దగ్గర సర్పం, చిన్న కళ్లు, వక్రతొండం, ఎలుకవాహనం గుర్తొస్తుంది. ఇది ఆయన రూపం మాత్రమే కాదు..భక్తుల్లో ఉండాల్సిన సద్గుణాల సమ్మేళనం.



పూర్ణకుంభంలా ఉన్న వినాయకుడి దేహం పరిపూర్ణమైన ఈ జగత్తుకు నిదర్శనం

పెద్దబొజ్జ అంటే భోజన ప్రియత్వం కాదు..జీవితంలో మంచి చెడులను జీర్ణించుకోవాలని ఆంతర్యం

ఏనుగు తల మేధస్సుకు సంకేతం అయితే...చిన్న కళ్లు సునిశిత పరిశీలనకు గుర్తు

వక్రతుండం ఓంకారం ప్రణవనాదానికి సింబల్

ఏనుగులాంటి ఆకారాన్ని మోస్తున్న మూషికం ఆశకు చిహ్నం

మూషికం చిన్నగానే ఉన్నప్పటికీ ఎంతదూరమైనా ప్రయాణిస్తుంది..వేగంగా కదులుతుంది..పట్టుదల ఉండే ఏదైనా సాధ్యం అని చెప్పడమే

వినాయకుడి 4 చేతులు మానవాతీత సామర్థ్యాలకు, తత్వానికి సంకేతం. లంబోదరుడి పొట్టచుట్టూ ఉండే సర్పం శక్తికి సంకేతం..

చేతిలో ఉన్న పాశం, అంకుశం సన్మార్గంలో నడిపించే సాధనాలకు ప్రతీక..

అనవసరమైన విషయాలను చేటలా చెరిగేసి అవసరమైన మంచి సంగతులను మాత్రమే స్వీకరించాలని చేటంత చెవులు చెబుతున్నాయ్

ఎక్కువ తెలుసుకుని తక్కువ మాట్లాడాలని చెబుతోంది చిన్న నోరు

పార్వతీ తనయుడి చేతిలో ఉన్న గొడ్డలి ఇహలోక బంధాలను తెంచుకోమని చెప్పేందుకు సూచన

గణేషుడి ప్రతి విగ్రహం చేతిలో లడ్డూ గమనించే ఉంటారుగా..

వినాయకుడికి లడ్డూ అంటే అంత ఇష్టం...ఆశయాలకు అనుగుణంగా అడుగేస్తే విజయం మీ సొంతం అవుతుందని అర్థం..

తెలివితేటలకు ప్రతీకగా గణపతిని ఎందుకు చెబుతారంటే..వ్యాసమహర్షి చెబుతుండగా మహాభారతాన్ని రాసింది ఆయనే. మహాభారతం రాసేందుకు ఓ లేఖకుడి అవసరం పడింది. తాను చెబుతుంటే రాయాలని వ్యాసుడు కోరాడు. అప్పుడు గణనాథుడు స్పందించి.. వ్యాసుడికే ఓ పరీక్ష పెట్టాడు. వ్యాసుడు నిజంగా తన మనసులోంచి వచ్చిందే చెబుతున్నారో లేదో అనే ఉద్దేశంతో...మీరు ఆపకుండా చెబితే రాస్తాను అన్నాడు. ఎక్కడైతే ఆగుతారో అక్కడ కలం పక్కనపెట్టేసి వెళ్లిపోతానన్నాడు. సరే అన్న వ్యాసమహర్షి చెప్పడం ప్రారంభించారు...అక్షరం కూడా పొల్లుపోకుండా రాశాడు వినాయకుడు.